సాక్షి
విశాఖపట్నం
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024











తొలిరోజు సూపర్‌హిట్


లోకల్ బాయ్ భరత్

- భారత్, ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌కు పోటెత్తిన అభిమానులు
- స్టేడియంలో ఏర్పాట్లు భేష్
- కితాబిచ్చిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్

ఆహ్లాదకర వాతావరణం.. భారీగా హాజరైన అభిమానులు.. ఆపై మైదానంలో మన ఆటగాళ్ల జోరు.. మొత్తంగా భారత్, ఇంగ్లండ్ రెండో టెస్ట్ మ్యాచ్ తొలిరోజు అభిమానుల అంచనాలకు తగినట్లుగా సరైన వినోదాన్ని పంచింది. ఉదయం టాస్ ముందు ప్రాక్టీస్ సమయం నుంచే కోలాహలం కనిపించింది. యశస్వి చక్కటి షాట్లతో అందరినీ అలరించాడు. రోహిత్ ఔటైనప్పుడు నిశ్శబ్దం నెలకొంది. లోకల్ ప్లేయర్ భరత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఏసీఏ ప్రత్యేక ఏర్పాట్లతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలి వచ్చారు. అభిమానుల హర్షాతిరేకాలతో స్టేడియం దద్దరిల్లింది.

– విశాఖ స్పోర్ట్స్

వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన భారత్– ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు పోటెత్తారు. కౌంటర్లలో టికెట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఇంగ్లండ్ అభిమానులు సైతం లైన్లలో నిల్చొని మరీ ప్రవేశం పొందారు. రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని ముందుగానే ఏసీఏ ప్రకటించడంతో.. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు క్యూ కట్టారు. వీరందరినీ స్టేడియంలోని 'కె'స్టాండ్ లోయర్ టైర్‌లో అనుమతించారు. కొందరు స్టేడియం బయటే ఉండిపోగా.. వారిని కూడా అప్పర్ టైర్‌లోకి అనుమతించారు. ఏసీఏ అనుబంధ క్లబ్‌ల ఔత్సాహిక క్రికెటర్లకు స్టేడియం సౌత్ బ్లాక్‌లోని సీ, డీ స్టాండ్స్‌లోకి ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తొలిరోజు మ్యాచ్‌కు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది అభిమానులు తరలివచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం స్టేడియంలో పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేసిందని వెల్లడించారు.

స్టేడియంలో ముచ్చటగా మూడోసారి

ఇక్కడ జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భాగంగా ఆతిథ్య భారత్ జట్టు ముచ్చటగా మూడోసారి టాస్ గెలిచింది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన టెస్ట్‌లో టాస్ గెలిచిన భారత్ రెండు రోజుల్లోనే ఆటను ముగించేసి శుభారంభం చేసింది. దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ టాస్ గెలిచి రెండో ఇన్నింగ్స్‌ను పూర్తిగా ఆడకుండానే డిక్లేర్ చేసి విజయకేతనం ఎగురవేసింది. మరోసారి ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్‌లోనూ టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ తొలిరోజు ఆధిక్యాన్ని ప్రదర్శించింది.


రోహిత్ వికెట్ తీసిన ఆనందంలో..





స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి వసతులు



అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తీసిపోని విధంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో వసతులు ఉన్నాయి. ఏసీఏ సిబ్బంది ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినా ప్రేక్షకుల మధ్యలోనే కూర్చొని మ్యాచ్ చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఇండియాకు వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చొని మ్యాచ్ చూడటం ఇదే మొదటి సారి. అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చారు. వారందరికీ ఏసీఏ తగిన విధంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయం.

– గరెత్ విన్ ఓవెన్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్, ఏపీ, తెలంగాణ

ఆహ్లాదకర వాతావరణం



స్టేడియం పరిసర ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంది. స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వివిధ రకాల వంటకాలను అందుబాటులో ఉంచారు.

– డేవ్ క్లార్క్, ఇంగ్లండ్

ఎంజాయ్ చేశాం



క్రికెట్ స్టేడియం లోపల, బయటకు పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు. ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చినా తాము ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్టేడియంలో మ్యాచ్ చూసి ఎంజాయ్ చేశాం.

– ఎమ్మా, క్రికెట్ అభిమాని, ఇంగ్లండ్




స్టేడియం బయట క్యూ





బీఆర్‌టీఎస్ బాధితులకు అండగా నిలిచాం..

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- బాధితులకు టీడీఆర్‌ల పంపిణీ
- రూ.32.57 కోట్లతో అడవివరం–పాతగోశాల బీఆర్‌టీఎస్ రోడ్డుకు శంకుస్థాపన


బీఆర్‌టీస్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం : అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం, టీడీఆర్‌లు ఇచ్చే విషయంలో సమన్యాయం చేసినట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. 98వ వార్డు పద్మావతి నగర్‌లోని ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం బీఆర్‌టీఎస్ బాధితులకు టీడీఆర్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ముత్తంశెట్టి పలువురు లబ్ధిదారులకు టీడీఆర్‌లను అందజేశారు. అలాగే రూ.32.57 కోట్లతో పాతగోశాల నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ అప్పన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో అడవివరం మార్గం ఎంతో రద్దీగా మారిందన్నారు. దీంతో రోడ్డు విస్తరణ అనివార్యమైందన్నారు. గ్రామస్తులకు అన్ని అన్ని విధాలా న్యాయం చేశామన్నారు. 280 మంది బాధితులున్నారని, ఇప్పటికే నష్టపరిహారం చెక్కులను అందించినట్లు తెలిపారు. ఇప్పుడు వారందరికీ నాలుగేసి టీడీఆర్‌లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయేవారు 60 మంది వరకు ఉన్నారని, వారందరికీ జగనన్న కాలనీల్లో ఇళ్లు కూడా ఇస్తామన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. బీఆర్‌టీఎస్ విస్తరణలో ఇళ్లు కోల్పోగా మిగిలిన స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని దేవస్థానం ఈవోకి సూచించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌శర్మ మాట్లాడుతూ టీడీఆర్‌లు, నష్టపరిహారం ఇచ్చే విషయంలో బాధితులందరికీ న్యాయం చేశామన్నారు. ఎవరూ ఎలాంటి అపోహలు, వదంతులు నమ్మవద్దని తెలిపారు. కొందరికి కుటుంబ సమస్యలు ఉండటం వల్ల టీడీఆర్‌లు, నష్టపరిహారం చెల్లింపు విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, అవి తొలగాక వారికి కూడా ఇస్తామన్నారు. ప్రస్తుతం 210 మంది బాధితులకు టీడీఆర్‌లు అందిస్తున్నామని, సమస్యలు తీరిన తర్వాత మరో 70 మందికి కూడా అందిస్తామన్నారు. బాధితుల సమస్యల ఫిర్యాదుల కోసం వారం రోజులపాటు ఏసీపీ అడవివరంలోని సచివాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్, జోన్–8 కమిషనర్ హైమావతి, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు అనుమతి పత్రాల అందజేత

- త్వరలో పంచగ్రామాల భూ సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే ముత్తంశెట్టి


అనుమతి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కార్పొరేటర్ స్వాతి

సింహాచలం : పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతుల కోసం దరఖాస్తులు చేసుకున్న పలువురికి అనుమతి పత్రాలను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి ముత్తంశెట్టి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఏళ్లగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న బాధితులకు అండగా నిలిచిందన్నారు. ఇళ్ల రిపేర్లు చేసుకునేందుకు అధికారికంగా ఉత్తర్వులు జారీచేసిందన్నారు. మరమ్మతుల కోసం 530 దరఖాస్తులు రాగా 205 మందికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ సమస్య కోర్టు పరిధిలో ఉండటంతో.. సరిసమాన భూమిని దేవస్థానానికి ప్రభుత్వం ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ బాధితులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎవరికైనా అప్రోవల్ రాకపోతే మరోసారి వెరిఫై చేస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సీసీపీ సురేష్‌కుమార్, జోన్–8 కమిషనర్ హైమావతి, 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, 98వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, వైఎస్సార్ సీపీ నాయకులు లండ రమణ, కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్ విజేత 52వ వార్డు


స్వచ్ఛత సేవా బ్యాడ్జీలు సాధించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో 91, 18వ వార్డులు
- వేడుకగా అవార్డుల బహూకరణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 'స్వచ్ఛత ఎకో వైజాగ్ అవార్డు'ల ప్రదానోత్సవం శుక్రవారం సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో వైభవంగా జరిగింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్వచ్ఛత ఎకో వైజాగ్ అవార్డులను విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వార్డుల మధ్య పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 8 జోన్ల పరిధిలోని 98 వార్డుల్లో నిర్వహించిన పోటీల్లో 52వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచి రూ.20 లక్షలు సొంతం చేసుకుందన్నారు. 91వ వార్డు ద్వితీయ, 18వ వార్డు తృతీయ స్థానంలో నిలిచి రూ.10 లక్షలు, రూ.5 లక్షలు చొప్పున సాధించాయని వెల్లడించారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులను మేయర్ అభినందిస్తూ జ్ఞాపికలు బహూకరించారు. 52వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 91వ వార్డు కార్పొరేటర్ కుంచ జ్యోత్స్న, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణిని ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. 10 శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్వచ్ఛత సేవా బ్యాడ్జీలు అందించారు.

పోటీతత్వం అవసరం

కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ వార్డుల మధ్య పోటీతత్వం అవసరమని గుర్తించి వినూత్న పద్ధతిలో సేవా అవార్డులను అందజేశామన్నారు. నగరం దాదాపు 35 శాతం పచ్చదనంతో నిండి ఉందని, 50శాతం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ఎకో వైజాగ్ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 4,477 నగరాలు పోటీపడి విశాఖ నాలుగో స్థానం దక్కించుకుందని తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ సేవా అవార్డుల ద్వారా విశాఖ నగరాన్ని మరింత పరిశుభ్రత నగరంగా తీర్చిదిద్దగలమన్నారు. పలువురు కార్పొరేటర్లు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.


ద్వితీయ స్థానం: 91వ వార్డు


మొదటిస్థానం: 52 వ వార్డు


మూడో స్థానం: 18వ వార్డు

జాయింట్ కమిషనర్‌గా ఫకీరప్ప బాధ్యతలు


సీపీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జాయింట్ కమిషనర్ ఫకీరప్ప

విశాఖ సిటీ: విశాఖ జాయింట్ కమిషనర్‌గా కె.ఫకీరప్ప కాఫీనెళ్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భారీ స్థాయిలో ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా సీఐడీ ఎస్పీగా ఉన్న ఫకీరప్పను విశాఖలో కీలకమైన జాయింట్ కమిషనర్‌గా నియమించింది. 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీగానే కాకుండా పలు జిల్లాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2017–2018లో ఆయన విశాఖ డీసీపీ–1 కూడా పనిచేశారు. దీంతో ఆయనకు విశాఖపై అవగాహన ఉంది.

జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కేకే రాజు

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం ఏయూ గ్రౌండ్స్‌లో క్రికెట్ సెమీస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ప్రారంభించారు. ఇరుజట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకుని వారితోనే కూర్చొని మ్యాచ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారిని ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో ఐదు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, గాలిప్రసాద్ పాల్గొన్నారు.

9న అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈనెల 9న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం సుమారు 3.30 గంటలకు స్వామిని కొండదిగువ వరాహ పుష్కరిణిని తీసుకురావడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి తెప్పోత్సవం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం అడవివరం పురవీధిల్లో సర్వజనమనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి ఉంటుందన్నారు. తెప్పోత్సవం సందర్భంగా ఈనెల 9న సాయంత్రం 6గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనం లభిస్తుందని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అధికారిపై మహిళా ఉన్నతాధికారి ఫిర్యాదు

ఉక్కునగరం : విధి నిర్వహణలో ఉన్న తనపై అదే విభాగానికి చెందిన అధికారి దౌర్జన్యానికి ప్రయత్నించి కులం పేరుతో దూషించారంటూ మహిళా ఉన్నతాధికారి స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలవి.. స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డిసి విభాగానికి చెందిన మేనేజర్ అనంత పుర్వార్.. విభాగాధిపతి ఎస్.భానుకు ఫోన్ చేసి తనకు తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడ్ తగ్గిందని దుర్భాషలాడి ఆమెను కులం పేరుతో దూషించారు. ఆమెపై దౌర్జన్యం చేయబోగా దిగువ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. దీనిపై ఆమె స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులతోపాటు పాటు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరిపి పుర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు.

ఉత్సాహంగా ఆసరా సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆనంద్‌కుమార్, మళ్ల విజయప్రసాద్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ హరి వెంకటకుమారి

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగిన సంబరాల్లో అధిక సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు. గాజువాక నియోజకవర్గంలోని 5,492 స్వయం సహాయక సంఘాలకు చెందిన 56,040 మంది మహిళలకు రూ.38,06,93,095 రుణమాఫీ చెక్కును వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కైలాసగిరి ఘాట్ రోడ్డులో మినీ బస్ దగ్ధం

అరిలోవ: కై లాసగిరి ఘాట్‌రోడ్డులో శుక్రవారం ప్రమాదవశాత్తూ మినీ బస్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. మినీ బస్‌లో కొంత మంది సందర్శకులు నగరం నుంచి విశాలాక్షినగర్ కూడలి మీదుగా ఘాట్ రోడ్డులో కై లాసగిరిపైకి వెళ్లారు. పైకి వెళుతున్నప్పుడే బస్ కండిషన్ సరిగా లేకపోవడం డ్రైవర్ గుర్తించాడు. కొండపై సందర్శకులను దించేసిన డ్రైవర్ వెంటనే ఖాళీ బస్‌తో కిందకు బయలుదేరాడు. ఘాట్ రోడ్డు చెక్‌పోస్టు సమీపానికి వచ్చేసరికి బస్ నుంచి పొగలు రావడం గమనించాడు. బస్సును పక్కకు ఆపి పరారయ్యాడు. బస్ నుంచి మంటలు రావడంతో ఆ సమయంలో ఘాట్ రోడ్డులో ప్రయాణించే సందర్శకులు ఆందోళన చెందారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న వీఎంఆర్‌డీఏ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో బస్‌లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



మినీ బస్ నుంచి వస్తున్న మంటలు

ఆర్.కె.బీచ్‌లో అలలపై వంతెన!



ఆర్.కె.బీచ్‌లో సముద్రంలో తేలియాడే వంతెన సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న తీరం వద్ద హై–డెన్సిటీ పాలిథిలిన్(హెచ్‌డీపీఈ) బ్లాక్స్‌ను ఒకదానికి మరొకటి జత చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తి చేసి.. త్వరలోనే సందర్శకులకు అనుమతిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. - బీచ్‌రోడ్డు

క్షతగాత్రులను కాపాడితే రూ.5వేల బహుమతి

రవాణా, రోడ్డు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవాణా, రోడ్డు, భవనాల కార్యదర్శి ప్రద్యుమ్న

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడితే రూ.5వేల నగదు బహుమతి అందిస్తున్నట్లు రవాణా, రోడ్డు, భవనాల శాఖ కార్యదర్శి పి.ఎస్.ప్రద్యుమ్న తెలిపారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం విశాఖ వచ్చిన ఆయన్ని.. విమానాశ్రయంలో రవాణా శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుడ్ మానిటరింగ్ గైడ్‌లైన్స్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడం అందరూ బాధ్యతగా భావించాలన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ.5 వేలు బహుమతిగా అందిస్తోందని వెల్లడించారు. రీజినల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి.సుందర్, ఉప రవాణా కమిషనర్ రాజారత్నం, ఆర్‌టీవోలు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, వి.జయప్రకాష్, వేణుగోపాలరావు, వాహన తనిఖీ అధికారి గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెటర్ల కోసం ఆర్టీసీ బస్సులు

సాక్షి, విశాఖపట్నం: భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్ల కోసం ఆర్టీసీ రెండు బస్సులను సమకూర్చింది. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం నుంచి టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. జనవరి 30న ఇరుజట్ల ఆటగాళ్లు విశాఖపట్నం చేరుకున్నారు. అప్పటి నుంచి వీరు బస చేసిన హోటల్ నుంచి ఉదయం క్రికెట్ స్టేడియానికి తీసుకెళ్లడానికి, ఆట ముగిశాక సాయంత్రం అక్కడ నుంచి హోటల్‌కు తీసుకు రావడానికి రెండు డాల్ఫిన్ క్రూయిజ్ ఏసీ బస్సులను కేటాయించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ బస్సులను క్రికెటర్ల కోసం కేటాయించినట్లు విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ 'సాక్షి'కి చెప్పారు.



భారత్, ఇంగ్లండ్ జట్లకు కేటాయించిన బస్సులు

ఓటర్ల నమోదుకు 'యువ' స్పందన

సాక్షి, విశాఖపట్నం : జిల్లాల్లో ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల నమోదు, తొలగింపుల బాధ్యత ఈఆర్‌ఓలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల సన్నద్ధత, నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో శుక్రవారం సమీక్షించారు. సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, ఈఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువ ఓటర్ల నమోదు బాగానే ఉందన్నారు. స్వీప్ కార్యక్రమం ద్వారా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మిగిలిన యువత నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తుది జాబితా ప్రచురణ నుంచి ఇప్పటి వరకు 2,449 మంది కొత్తగా ఓటర్లు నమోదు చేసుకోగా, వారిలో వివిధ కారణాలతో 885 మందిని తొలగించినట్లు కలెక్టర్ వివరించారు. ఓటర్ల నమోదు, తొలగింపుల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్‌వో మోహన్‌కుమార్

తహసీల్దార్లకు పోస్టింగులు

మహారాణిపేట: సాధారణ ఎన్నికల దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి విశాఖకు బదిలీపై వచ్చిన పలువురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వచ్చిన పలువురికి, విశాఖలో మూడు సంవత్సరాలు పూర్తికాని పలువురికి పోస్టింగులు ఇస్తూ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. 22 మందికి పోస్టింగులు ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన ఎస్.వెంకటరావుకు పెందుర్తి తహసీల్దార్‌గాను, వై.జయలక్ష్మికి ప్రత్యేక తహసీల్దార్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు(విశాఖపట్నం), విజయనగరం నుంచి వచ్చిన టి.రామకృష్ణను కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, జి.హేమంత్‌కుమార్ ఆనందపురం తహసీల్దార్‌గాను, శ్రీనివాస్ మిశ్రాను విశాఖ రూరల్ తహసీల్దార్‌గాను, పి.విజయభాస్కర్ గోపాలపట్నం తహసీల్దార్‌గా నియమించారు. బి.ఎస్.దేవప్రసాద్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా(అడ్మిన్), బి.నీలకంఠరావును కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరిండెంట్‌గా, సిహెచ్ బంగ్రాజును పద్మనాభం తహసీల్దార్‌గా, ఐ.భాస్కరరావును పెదగంట్యాడ తహసీల్దార్‌గాను,టి.గోవిందను భీమిలి తహసీల్దార్‌గాను, పి.విజయభాస్కర్‌ను గోపాలపట్నం తహసీల్దార్‌గా, జి.శ్రీరామ్మూర్తిని సీతమ్మధార తహసీల్దార్‌గాను, డి.రవిని ఎలక్షన్ సెల్ సూపరిండెంట్‌గా, ఎం.రమణమ్మను స్పెషల్ తహసీల్దార్(ఎల్ఏ) విశాఖ రెవెన్యూ డివిజన్, ఎస్.భాస్కరరావు జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా, వి.రామస్వామిని భీమిలి ఆర్‌డీవో ఆఫీసు డివిజనల్ పరిపాలనాధికారిగా, ఎస్.శివన్నారాయణను ములగాడ తహసీల్దార్‌గా, ఎస్.అప్పలరాజును విశాఖపట్నం ఆర్‌డీవో ఆఫీసు డివిజనల్ పరిపాలన అధికారిగా, ఎం.భుజంగరావును విశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావును వీఎంఆర్‌డీఏ ల్యాండ్ ఎక్విజిషన్ స్పెషల్ తహసీల్దార్‌గాను, మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనందకుమార్‌ను ల్యాండ్ రీఫామ్స్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు.

విదేశీ ప్రయాణం.. అంతలోనే ప్రమాదం

- డివైడర్‌ను ఢీ కొట్టిన కారు.. యువకుడి మృతి
- శనివారం కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న పూర్ణారెడ్డి



సీతకొండ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి నుజ్జయిన కారు (ఇన్‌సెట్) మృతుడు పూర్ణారెడ్డి(ఫైల్)

అరిలోవ: డిగ్రీ చదువుకున్న ఓ యువకుడు కువైట్‌లో ఏడాదిగా పనిచేస్తున్నాడు. ఇటీవల విశాఖ వచ్చిన ఆయన శనివారం తిరిగి కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపి ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాద రూపంలో మృత్యువు వెంటాడింది. కారులో ప్రయాణిస్తున్న ఆయన ఉదయం 5.30 సమయంలో డివైడర్‌ను ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. అరిలోవ ట్రాఫిక్ సీఐ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ తెలిపిన వివరాలివీ.. దొండపర్తి ప్రాంతానికి చెందిన జీరు పూర్ణారెడ్డి(23)కి అన్నయ్య భానుప్రకాష్ రెడ్డి, తల్లిదండ్రులు ఉన్నారు. డిగ్రీ చదువుకున్న ఆయన ఏడాదిగా కువైట్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల విశాఖ వచ్చాడు. శనివారం తిరిగి కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. కాగా.. అతని అన్నయ్య జీరు భానుప్రకాష్‌రెడ్డి, మరో ఇద్దరు స్నేహితులతో కలసి గురువారం బీచ్ ప్రాంతంలో సరదాగా గడిపారు. శుక్రవారం ఉదయం 5.30గంటల సమయంలో రుషికొండ వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా నగరానికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా కారు నడిపి సీతకొండ మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జయింది. కారు నడుపుతున్న పూర్ణారెడ్డికి తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. కారులో ఉన్న భానుప్రకాష్‌రెడ్డి, బోర వంశీరెడ్డి, నీలాపు సాయికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన ముగ్గురినీ చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. పూర్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. భానుప్రకాష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. పూర్ణారెడ్డి మృతితో అతని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి వద్దు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు



మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు

విశాఖ విద్య: పరీక్షల సమయంలో విద్యార్థులను ఎటువంటి ఒత్తిడికి గురిచేయవద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం సూచించారు. రామ్‌నగర్ శ్రీ చైతన్య స్కూల్ ప్రాంగణంలో పదో తరగతి పరీక్షలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. మార్కులు, ర్యాంకులు లక్ష్యం కాకుండా.. ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల్లో ఆందోళన, అభద్రతాభావం లేకుండా ముందస్తుగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో సంబంధిత నిపుణులతో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గీతం సైకియాట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సనపల విద్య, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎ.రమ్య మాట్లాడుతూ ఒత్తిడిని దూరం చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో అధిక సమయం వెచ్చించాలన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, మండల విద్యాశాఖాధికారులు పైడపు నాయుడు, పుష్యరాగం, జిల్లా బాలల సంరక్షణాధికారి బి.హెచ్.లక్ష్మి, పి.ఓ.ఎన్.ఐ.సి.మమత, శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల యువకుడి అసభ్య ప్రవర్తన

ఏడాది జైలు శిక్ష విధించిన న్యాయమూర్తి

విశాఖ లీగల్: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివీ. నిందితుడు ఎం.మోహన్‌కుమార్(24) అరిలోవలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బాధిత బాలిక స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. ఈ బాలిక పట్ల అతను అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఈ నేపథ్యంలో 2019 నవంబర్ 8న నిందితుడు బాలిక పట్ల దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె చేయి పట్టుకుని ఇబ్బందులకు గురి చేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

ఉత్సాహంగా ఫ్యామిలీ ఫెస్ట్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో శుక్రవారం ఫ్యామిలీ ఫెస్ట్ నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, వారి కుటుంబాల్లోని పెద్దలను పిలిపించి, వారిని గౌరవించే కార్యక్రమం నిర్వహించారు. పెద్దలను గౌరవించేలా విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు ఇటువంటి వేడుకను నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు.



పేరెంట్స్‌కి పాదాభివందనం

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి



కొమ్మాది: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పార్టీ జేసీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ అన్నపరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జేసీఎస్ టీమ్‌తో ఆయన సమావేశయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం మేరకు రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు రావాలి, ఎందుకు కావాలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ గెలుపే అజెండాగా.. సమష్టిగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో జేసీఎస్ కో–ఆర్డినేటర్లు, కన్వీనర్లు పూర్ణ, ఆనంద్ శర్మ, కిరణ్‌రెడ్డి, నియోజకవర్గ మండల క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు మహిళా పారిశ్రామికవేత్తల ఎక్స్‌పో

దాబాగార్డెన్స్: గ్రామీణ, గిరిజన మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో హోటల్ దసపల్లా దర్శినీ, సందర్శినీ(హాల్స్)లో ఎక్స్‌పో అంగడి–2 నిర్వహించనుంది. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఎక్స్‌పోను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి ప్రారంభించనున్నారు. ఎక్స్‌పోలో ఆర్ట్ ఉత్పత్తులు, సబ్బులు, పెర్ఫ్యూమ్స్, ఆక్సిడైజ్డ్ జ్యువెల్లరీ, ఖాదీ చీరలు, పెయింటింగ్‌లు, రెసిన్ ఆర్ట్, జ్యూట్ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్, చిరుధాన్యాల ఉత్పత్తులు తదితర హస్తకళా ఉత్పత్తుల శ్రేణిని 60 స్టాల్స్‌లో ప్రదర్శన, విక్రయాలు జరపనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఏపీ ఛాంబర్స్ మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ వై.గీతాశ్రీకాంత్ తెలిపారు.